క్లుప్తంగా

మహిళల రక్షణ కోసం షీ టీం



మరిపెడ రూరల్/కురవి: మహిళల హక్కులు, రక్షణ కోసమే షీటీం ప్రత్యేకంగా పని చేస్తుందని షీటీం ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ జి.మోహన్ అన్నారు. మహిళలు, విద్యార్థినీలకు, పిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలపై షీటీం ఆధ్వర్యంలో గ్రామస్తులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆకతాయిలు వేధిస్తే వెంటనే షీటీం పోలీస్ హెల్ప్‌లైన్ నంబర్ 79011 42009 లేదా డయల్ 100 డయల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో షీటీం ఎస్సై కుమారి సునంద, సిబ్బంది అరుణ, సుప్రజ, బాలు, సర్పంచ్ వీరన్న పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా చట్టాలు



కురవి: దివ్యాంగులకు చట్టం అండగా ఉంటుందని కురవి ఎస్సై బి.రాము అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గుడిసెంటర్‌లో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సంఘం నాయకులతో కలిసి ఎస్సై కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాజా, నాయకులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని నిరసన

చిన్నగూడూరు: తనకు చెందాల్సిన వ్యవసాయ భూమిని రెవెన్యూ అధికారులు అత్యుత్సాహంతో మరొకరి పేరున రిజిస్ట్రేషన్ చేశారంటూ మండల కేంద్రానికి చెందిన బాధితుడు చెన్నాల అశోక్ నిరసన వ్యక్తం చేశాడు. మంగళవారం బాధితుడు మాట్లాడుతూ.. తన తండ్రి కిష్టయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించాడన్నారు. తండ్రి పేర ఉన్న రెండు ఎకరాల పట్టా భూమిని తనకు తెలియకుండానే తన సవతి తల్లి పేరు మీద రెవెన్యూ అధికారులు రిజిస్ట్రేషన్ చేశారన్నారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని, లేని పక్షంలో ఆత్మహత్యే శరణ్యమని వేడుకుంటున్నట్లు తెలిపాడు.

'ఎవ్వరూ ఆక్రమించుకోలేదు'

తొర్రూరు రూరల్: తన వ్యవసాయ భూమిని ఎవ్వరూ ఆక్రమించుకోలేదని, తనే అమ్ముకున్నట్లు మండలంలోని మాటేడు గ్రామానికి చెందిన వల్లపు రాజమ్మ అనే మహిళ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. తన భర్తకు, తనకు కరోనా రావడంతో భర్త మరణించాడని, చేసిన అప్పులు తీర్చలేక రామసహాయం కిషోర్ రెడ్డికి వ్యవసాయ భూమిని అమ్ముకున్నట్లు తెలిపింది. తన బావ కొడుకు వల్లపు శ్రీకాంత్ తరచూ గొడవ చేస్తూ వ్యవసాయ భూమిని అమ్ముకోకుండా అడ్డుపడుతూ, బెదిరింపులకు పాల్పడుతున్నట్లు బాధితురాలు ఆరోపించింది.

అకారణంగా విద్యార్థిని కొట్టిన టీచర్లు

కేసముద్రం: మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో మంగళవారం 8వ తరగతి చదువుతున్న ఇమ్రాన్ అనే విద్యార్థిని అకారణంగా ఇద్దరు టీచర్లు వీపుపై చేతితో కొట్టడంతో వాతలు పడ్డాయని విద్యార్థి తండ్రి ఆరోపించాడు. మూత్ర విసర్జనకు వెళ్లి ఆలస్యంగా వచ్చావంటూ కర్రతో కొట్టారని సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

జీవన వికాసానికి మాతృభాష దోహదం

మహబూబాబాద్: మాతృభాషలో బోధన, రచనలు మానవ వికాసానికి దోహదపడతాయని శుభోదయం సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. స్థానిక బ్యాంక్ కాలనీలో సంస్థ కార్యాలయంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా మంగళవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో లక్ష్మి, నరేందర్, పాపయ్య, కాంతారావు, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

కురవి: మండలంలోని సూదనపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ధరావత్ వెంకన్న, తెలుగు పండిట్ చిన్నం ప్రదీప్‌కుమార్, ఉపాధ్యాయులు, తాతారావు, మాధవరావు, అంగన్‌వాడీ టీచర్లు, నాగేంద్ర, జ్యోతి, ఆయా లక్ష్మీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మహబూబాబాద్ రూరల్: మాతృభాషను పరిరక్షించుకోవాలని ఆమనగల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు క్లెం వెంకట్ రెడ్డి అన్నారు. మండలంలోని అమనగల్ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవ వేడుకలు మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం సదానందం, జనార్ధన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని



మహబూబాబాద్ అర్బన్: మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మమత

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో తెలుగు, హిందీ, ఆంగ్ల విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో మాతృ భాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వి.మమత, అధ్యాపకులు రామా రత్నమాల, రాంరెడ్డి, యుంగధర్, బొంద్యాలు, వేణుగోపాల్, వెంకటేశ్వర్లు, రాజేందర్, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

కేసముద్రం: మండలంలోని నర్సింహులగూడెం గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలో మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం కొడిపాక రమేష్ మాట్లాడుతూ.. చిరుధాన్యాలతో విద్యార్థులు తెలుగు భాషా వర్ణమాలను చిత్రించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు పెరుమాండ్ల ప్రభాకర్ పాల్గొన్నారు.



గార్ల: డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నర్సమ్మ



మహబూబాబాద్ రూరల్: బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం

గార్ల: తేనె కంటే తీయనైనది తెలుగు భాష అని స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నర్సమ్మ అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు లక్ష్మణ్‌రావు, చార్లీ, అజీత్, రాజేష్, సాయికుమార్, వెంకన్న, సుందరయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశ్నించినందుకు దాడులు చేస్తారా?

మహబూబాబాద్ రూరల్: రాష్ట్రంలో రోజురోజుకు బీఆర్‌ఎస్ పార్టీ నాయకుల అరాచకాలు పెరిగిపోతున్నాయని, ఆపాలనకు రోజులు దగ్గరపడ్డాయని కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ భూక్య మురళీనాయక్ అన్నారు. హనుమకొండలో యువజన కాంగ్రెస్ నాయకులు తోట పవన్‌పై దాడిని నిరసిస్తూ జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను మంగళవారం దహనం చేశారు. అనంతరం మురళీనాయక్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ అరాచక పాలనను ప్రశ్నించినందుకు దాడులు చేస్తారా అని విమర్శించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు నీరుటి లక్ష్మీనారాయణ, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బానోత్ ప్రసాద్‌నాయక్, కేకేసీ జిల్లా అధ్యక్షుడు సల్వాది దిలీప్, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షులు గందసిరి శ్రావణ్, ఎంపీటీసీ మంగిలాల్, యువజన కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు కమలిందర్, బ్లాక్ కాంగ్రెస్ సభ్యులు రంగన్న పాల్గొన్నారు.



మహబూబాబాద్ రూరల్: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

నెల్లికుదురు: యూత్ కాంగ్రెస్ నాయకుడు పవన్‌పై బీఆర్‌ఎస్ గుండాల దాడిని నిరసిస్తూ మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో మంగళవారం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా మండల యూత్ కాంగ్రెస్ నాయకుడు మద్దెల రాజేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు మానేందర్, వీరన్న, పూర్ణచందర్, రాకేష్, అరుణ్‌కుమార్, శ్రీనివాస్, కొమురెల్లి, నర్సయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే దాడులు

మహబూబాబాద్ రూరల్: ఓటమి భయంతోనే బీఆర్‌ఎస్ నాయకులు దాడులకు పాల్పడుతున్నారని మానుకోట వైస్ ఎంపీపీ, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఎల్ది మల్లయ్య గౌడ్ అన్నారు. మండలంలోని ఆమనగల్ గ్రామంలో మంగళవారం ఆయన మాట్లాడారు. బీజేపీ నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో రాష్ట్ర గిరిజన మోర్చా అధ్యక్షుడు జాటోతు హుస్సేన్ నాయక్‌ను బీఆర్‌ఎస్ నాయకులు గాయపరిచారన్నారు. వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే టికెట్ వస్తుందో రాదో అనే డైలామాలో ఉండి తొత్తుల ద్వారా బీజేపీ నాయకులపై దాడులకు పురిగొల్పుతున్నారని, ఈ ఘటన మొత్తం ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా ఈ ఏడాది జరిగే సాధారణ ఎన్నికల్లో మానుకోట గడ్డ మీద బీజేపీ జెండా ఎగరడం ఖాయమని తెలిపారు. సమావేశంలో వెంకటేష్, యాకన్న, కృష్ణ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ ప్రభుత్వం ఇంటికి వెళ్లక తప్పదు

తొర్రూరు రూరల్: సీఎం కేసీఆర్ ప్రభుత్వం వచ్చే ఎన్నికల్లో ఇంటికి వెళ్లక తప్పదని బీజేపీ రాష్ట్ర నాయకుడు పెదగాని సోమయ్య అన్నారు. మంగళవారం మండలంలోని వెంకటాపురం, అమర్‌సింగ్ తండాల్లో బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో కార్నర్ సమావేశాలను నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు యాకన్న, సురేష్, రామ్మోహన్‌రెడ్డి, సురేష్, కుమార్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



మహబూబాబాద్ రూరల్: మాట్లాడుతున్న మల్లయ్య

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

దోర్నకల్: బీజేపీతోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమవుతుందని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుగులోత్ లక్ష్మణ్‌నాయక్ తెలిపారు. మండలంలోని అమ్మపాలెం గ్రామంలో ప్రజాగోస, బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్‌లో లక్ష్మణ్‌నాయక్ మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు బాసాని నాగేశ్వర్‌రావు, వెంకటమనోహర్, దేవా, గణేష్‌నాయక్ పాల్గొన్నారు.

ఆశయాలను కొనసాగించాలి

నర్సింహులపేట: గిరిజనుల ఆరాధ్యదైవం శ్రీసేవాలాల్ మహరాజ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం శ్రీసేవాలాల్ జయంతి వేడుకలను టీఆర్‌ఎస్ ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు టేకుల యాదగిరిరెడ్డి, కాలసాని దామోదర్‌రెడ్డి, మైదం దేవేందర్, మధు, శంకర్, నాగన్న, జగదీశ్వర్, డీఈ నర్సింగ్‌నాయక్, ఎంపీఓ సోమ్‌లాల్, భీముడు, గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

మహబూబాబాద్ అర్బన్: జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి గుగులోత్ సూర్యప్రకాష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల నాయకులు మంగళవారం ధర్నా చేశారు. సందర్భంగా సూర్యప్రకాష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ బడుల్లో నాసిరకమైన భోజనం తినలేక అవస్థలు పడుతున్నారన్నారు. అనంతరం సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల నాయకులు బానోత్ సింహాద్రి, రాజేష్, ఉపేందర్, నవీన్, లక్ష్మణ్, కల్యాణ్, నర్సింహ పాల్గొన్నారు.

రైల్వే ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి

మహబూబాబాద్ రూరల్: కేంద్ర ప్రభుత్వం బహుళ జాతి కంపెనీల లాభాల కోసం రైల్వేలను ప్రైవేట్ పరం చేస్తున్నారని దానిని ప్రతిఘటించాలని, అలాగే కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేసి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు డిమాండ్ చేశారు. మంగళవారం రైల్వేస్టేషన్ పర్యవేక్షకులు కనకరాజుకు వినతిపత్రం అందజేశారు. సమస్యల పరిష్కారం కోసం 22వ తేదీన రైలు నిలయం వద్ద జరిగే నిరసన కార్యక్రమంలో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కుమ్మరి కుంట్ల నాగన్న, శ్రీనివాస్, దుర్గారావు, సూర్య ప్రకాష్, సింహాద్రి ,కాసం రాజేష్, బాలాజీ, రేణుక, లావణ్య, సత్యవతి, రజిత పాల్గొన్నారు.

దోర్నకల్: రైల్వే రంగాన్ని ప్రైవేటీకరించడాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సీఐటీయూ మండల కార్యదర్శి దాసరి మల్లేశం డిమాండ్ చేశారు. రైల్వే కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని కోరుతూ తెలంగాణ రైల్వే క్యాజువల్ అండ్ ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక రైల్వేస్టేషన్‌లో రైల్వే అధికారులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మాన్‌సింగ్, శ్రీను, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రను అడ్డుకోవడం సిగ్గుచేటు

నెల్లికుదురు: వైఎస్సార్ టీపీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శాంతియుతంగా చేస్తున్న ప్రజాప్రస్థానం పాదయాత్రకు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకనే బీఆర్‌ఎస్ గూండాలు దాడులకు తెగబడుతున్నారని వైఎస్సార్ టీపీ జిల్లా యూత్ అధ్యక్షుడు రాము నాయక్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ప్రజాప్రస్థానం పాదయాత్రను బీఆర్‌ఎస్ నాయకులు అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ టీపీ అధికారంలోకి రావడం ఖాయమని, బీఆర్‌ఎస్ నాయకులు గుర్తుపెట్టుకోవాలన్నారు. సాయిరెడ్డి, సుమన్, సురేష్‌రెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామునాయక్

ఎస్సీ జాబితాలో చేర్చాలి

గూడూరు: చాకలి కులస్తులను ఎస్సీ జాబితాలో చేర్చాలని చాకలి ఎస్సీ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీలక్ష్మి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన ఎదునూరి సాంబయ్య కుటుంబాన్ని ఆమె పరామర్శించి మాట్లాడారు. ప్రభుత్వం చాకలి కులస్తులను ఎస్సీ జాబితాలో చేర్చాలని, లేనిచో మార్చి 5వ తేదీన ప్రగతి భవన్ ముట్టడి చేస్తామన్నారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర నాయకులు ఎదునూరి వెంకన్న, వెంకటప్పయ్య, మండల అధ్యక్షుడు యాకయ్య, చాగంటి భీముడు, శ్రీనివాస్, సాయిలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'కంటి వెలుగు' శిబిరం



తొర్రూరు రూరల్: టీక్యాతండాలో కంటివెలుగు శిబిరం ప్రారంభిస్తున్న ఎంపీపీ అంజయ్య

తొర్రూరు రూరల్: ప్రతి ఒక్కరూ కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ తూర్పాటి అంజయ్య కోరారు. మంగళవారం మండలంలోని కంఠాయపాలెం, టీక్యాతండల్లో వైద్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాలను డిప్యూటి డీఎంహెచ్‌ఓ డాక్టర్ గుండాల మురళీధర్‌తో కలిసి ఎంపీపీ అంజయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, సర్పంచ్‌లు శ్రీపాల్‌రెడ్డి, జాటోతు కౌసల్య, ఎంపీటీసీలు మల్లమ్మ, పల్లె దేవమ్మ, వైద్యులు పాల్గొన్నారు.

దంతాలపల్లి: కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ఓలాద్రి ఉమా మల్లారెడ్డి అన్నారు. మండలంలోని వేములపల్లి గ్రామంలో మంగళవారం కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల రైతు సమితి కోఆర్డినేటర్ ఓలాద్రి మల్లారెడ్డి, సర్పంచ్ నాగిరెడ్డి వసంత, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశవర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

బయ్యారం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటి వెలుగు పథకం మంచి కార్యక్రమం అని ఎంపీపీ చేపూరి మౌనిక అన్నారు. మంగళవారం మండలంలోని జగత్‌రావుపేటలో ఏర్పాటు చేసిన కంటివెలుగు కార్యక్రమంలో ఎంపీపీ కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కారం భాస్కర్ పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

గార్ల: దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న పాకాల ఏటిపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని సీపీఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడారు. బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

దంతాలపల్లి: మండలం రెపోని గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ నిధుల దుర్వినియోగం చేసినట్లు వచ్చిన ఫిర్యాదుతో విచారణ చేపట్టినట్లు మండల పంచాయతీ అధికారి అఫ్సర్‌పాషా మంగళవారం తెలిపారు. నివేదికను ఉన్నత అధికారులకు పంపనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగిరెడ్డి శైలజ, కార్యదర్శి హరి పాల్గొన్నారు.

విద్యార్థులకు పలకల పంపిణీ

కురవి: సీరోలు మండలం ఉప్పరిగూడెం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న విద్యార్థులకు గ్రామ సీపీఎం శాఖ కార్యదర్శి కొప్పెర రామన్న సొంత ఖర్చులతో పలకలను మంగళవారం బహూకరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భవాని, సుభాషిణి, హరిత, షాహిని, నర్సింగ్, అశ్విని పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

బయ్యారం: ఏప్రిల్ 2, 3 తేదీల్లో భద్రాద్రి జిల్లా కొత్తగూడెంలో ఇఫ్టూ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.సీతారామయ్య తెలిపారు. మంగళవారం కమిటీ సమావేశంను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. రాష్ట్ర మహాసభల్లో భాగంగా మార్చి 5న బయ్యారంలో ఇఫ్టూ జిల్లా మహాసభ ఉంటుందని మహాసభల విజయవంతానికి నాయకులు కృషి చేయాలన్నారు. సమావేశంలో నాయకులు మదార్, వీరభద్రం, శ్రీధర్, నాగేశ్వరరావు, బాలమల్లు, లింగయ్య, శోభన్ పాల్గొన్నారు.

పార్టీ నుంచి సస్పెన్షన్

గంగారం: పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నాడని గంగారం కాంగ్రెస్ పార్టీ నాయకుడు జనగాం రామస్వామి సస్పెండ్ చేస్తూ ములుగు నియోజకవర్గ ఎమ్మెల్యే ధనసరి సీతక్క, జిల్లా అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సస్పెండ్ చేశారు.

సంక్షిప్త సమాచారం

బహుజనుల అభివృద్ధికి కృషి చేయాలి

కేసముద్రం: బహుజనుల అభివృద్ధికి పాలకులు కృషి చేయాలని అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కామ సంజీవరావు అన్నారు. మంగళవారం మండలంలోని ఇంటికన్నె గ్రామంలో అంబేడ్కర్ యువజన సంఘం గ్రామ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం సంఘం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా బెజ్జం శ్రావణ్‌కుమార్, గౌరవ అధ్యక్షుడిగా ఐతే సారయ్యలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సయ్య, వెంకన్న, అశోక్‌స్టాలిన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక నిధులు కేటాయించాలి

మహబూబాబాద్: ఏకగ్రీవ గ్రామపంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని గంగారం మండలం కోడిశెలమిట్ట సర్పంచ్ లక్ష్మి డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఏకగ్రీవ గ్రామపంచాయతీలకు నిధులు కేటాయిస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చి సంవత్సరాలు గడుస్తున్నా అమలుకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథా నాయకలు ప్రభాకర్, బిక్షం, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సన్మానం

తొర్రూరు రూరల్: ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో ఇటీవల డాక్టరేట్ పొందిన మండలంలోని చీకటాయపాలెం గ్రామానికి చెందిన వెల్పుకొండ వెంకటేష్‌ను మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పూలమాలలు, శాలువాతో హైదరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా సన్మానించి అభినందించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చిన్నగూడూరు: కేసీఆర్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని సర్పంచ్ శిరీష మంగీలాల్ అన్నారు. మంగళవారం మండలంలోని పగిడిపల్లి గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మూల మురళీధర్ రెడ్డి, రాంసింగ్, ధారాసింగ్, మల్లయ్య, రవి, వెంకన్న, బాలమల్లు, సింధుశ్రీపాల్, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైళ్ల రద్దుతో ఇబ్బందులు

దోర్నకల్: డోర్నకల్ రైల్వే జంక్షన్ పరిధిలో పలు రైళ్లు రద్దు కావడంతో ఈ ప్రాంత ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాజీపేట బల్లార్షా మార్గంతోపాటు దోర్నకల్, విజయవాడ మార్గంలో మూడోలైన్ నిర్మాణ పనులు కొనసాగుతుండడంతో మంగళవారం నుంచి 23వ తేదీ వరకు పలు రైళ్లను రద్దు చేశారు.

స్వయంపాలన దినోత్సవం



తొర్రూరు రూరల్: మండలంలోని కొమ్మనపెల్లి తండా ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు.

బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేయాలి

మహబూబాబాద్: తండాలను గ్రామపంచాయతీలు చేయగా ఆ నూతన జీపీలలో రేషన్‌షాపులు, బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ విద్యార్థి విభాగం జిల్లా కోఆర్డినేటర్ సురేష్‌బాబు డిమాండ్ చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నాగభవానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శరత్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

జీవ ఎరువుల ఉపయోగంపై అవగాహన

గార్ల: వరిపంటలో జీవఎరువులు వాడటం వలన భూమిలో నిరుపయోగంగా ఉన్న భాస్వరంను కరిగి మొక్కలకు మేలు చేస్తుందని వ్యవసాయ విస్తరణ అధికారి జె.ప్రశాంత్ సూచించారు. మంగళవారం గోపాలపురం గ్రామంలో రుక్మారావు అనే రైతు వరిపంటలో ఆయన క్షేత్ర ప్రదర్శన చేసి జీవ ఎరువుల ఉపయోగంపై రైతులకు అవగాహన కల్పించారు.

విరాళం అందజేత

దంతాలపల్లి: మండలంలోని దాట్ల గ్రామంలో యాదవ సంఘం నిర్మిస్తున్న గంగమ్మ ఆలయానికి డోర్నకల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జ్ రామచంద్రనాయక్ రూ.10వేలు విరాళంగా ఇచ్చాడు. ఎంపీటీసీ కొమ్మినేని సతీష్ ఆ డబ్బులను మంగళవారం యాదవ సంఘం సభ్యులకు అందజేశాడు.

క్రైం కార్నర్..

డబ్బులు ఇవ్వకుండా మోసం

మహబూబాబాద్ రూరల్: బియ్యం కొనుగోలు చేసిన ఓ వ్యక్తి బియ్యం అమ్మిన వ్యాపారికి డబ్బులు ఇవ్వకుండా మోసం చేయటంతో అతడిపై రైస్ మిల్ యజమాని టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. టౌన్ సీఐ వై.సతీష్ తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని జగదాంబ రైస్ మిల్ యజమాని బ్రిజ్ గోపాల్ ఝువర్ వద్ద మహారాష్ట్ర రాష్ట్రంలోని నాగపూర్ పట్టణానికి చెందిన ముఖేష్ అగర్వాల్ అనే వ్యక్తి నెలరోజుల వ్యవధిలో 800 క్వింటాళ్ల బియ్యం కొనుగోలు చేశాడు. డబ్బులు రూ.46 లక్షల పైచిలుకు మొత్తం ఇవ్వకుండా ముఖేష్ అగర్వాల్ మోసపూరిత మాటలు చెపుతూ వస్తుండగా అతడిపై నమ్మకం లేక బ్రిజ్ గోపాల్ ఝువర్ పోలీసులను ఆశ్రయించాడు.

20క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

పెద్దవంగర: రేషన్ బియ్యాన్ని హైదరాబాద్‌కు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్న సంఘటన మండల పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఏఎస్సై కుమారస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పుట్టపర్తి జిల్లా ధర్మవరం మండల కేంద్రానికి చెందిన సట్టిపి భాస్కర్‌రెడ్డి పలు గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని సేకరించి మోత్యాతండాలోని ఓ ఇంట్లో నిల్వ చేశాడు. సమాచారం మేరకు వాహనాన్ని పట్టుకున్నారు. తనిఖీ చేయగా అందులో 20క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసునమోదు చేసి భాస్కర్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నట్లు ఏఎస్సై తెలిపారు.

వివాహిత అదృశ్యం.. కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని గుమ్ముదూరు ప్రాంతానికి చెందిన ఓ వివాహిత అదృశ్యంపై ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్ సీఐ వై.సతీష్ మంగళవారం తెలిపారు. సదరు వివాహిత ఈనెల 18వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు తెలిపారు.

ఇళ్లలో చోరీ

గూడూరు: మండల కేంద్రంలోని రెండు ఇళ్లలో పట్టపగలు చోరీ జరిగిన సంఘటన మంగళవారం జరిగింది. వివరాల ప్రకారం.. గూడూరులోని శ్రీలక్ష్మీనారాయణస్వామి దేవాలయ వీధిలోని ఎలుగం కేదారి, శివాలయ వీధిలోని గుడ్ల కట్టమల్లు ఇళ్లకు తాళాలు వేసి ఉండడంతో గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడినట్లు బాధితులు తెలిపారు. కేదారి ఇంట్లో రూ.10వేలతో పాటు పట్టాగొలుసులు, కట్టమల్లు ఇంట్లో రూ.13వేలు దొంగిలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీష్‌గౌడ్ తెలిపాడు.

దాడికి ప్రయత్నించిన వ్యక్తి అరెస్టు

నెల్లికుదురు: దాడికి ప్రయత్నించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై పత్తిపాక జితేందర్ తెలిపారు. మంగళవారం ఎస్సై మాట్లాడుతూ.. మండలంలోని నైనాల గ్రామంలో సోమవారం రాత్రి బీజేపీ పార్టీ నాయకులు కార్నర్ సమావేశం నిర్వహిస్తుండగా అదే గ్రామానికి చెందిన పెరుమాండ్ల ఉపేందర్ వారి మీద దాడి చేయడానికి ప్రయత్నించినట్లు తెలిపాడు. నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం ఉపేందర్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్సై వివరించారు.

చికిత్స పొందుతున్న వివాహిత మృతి

నెల్లికుదురు: చికిత్స పొందుతూ ఓ వివాహిత మృతి చెదిన సంఘటన మండలంలోని మీత్యాతండా శివారు పంతులు తండాలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై పత్తిపాక జితేదంర్ తెలిపిన వివరాల ప్రకారం పంతులు తండాకు చెందిన జాటోతు రాధిక (38) అదే తండాలో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తుంది. ఆమె పెద్ద కూతురుకు వివాహం కుదిరింది. బంధువుల వివాహ గొడవల్లో ఆమె సొంతబావ కొడుకు జాటోతు సుమన్ రాధికను కాబోయే అల్లుడితోనే అక్రమ సంబంధం పెట్టుకున్నావు అనడంతో మనస్థాపం చెందిన ఆమె ఈనెల 19న ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి భర్త జాటోతు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నాడు.

కుమ్మరిబోడు తండాలో ఒకరు..

కురవి: పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందిన సంఘటన సీరోలు మండలం చింతపల్లి శివారు కుమ్మరిబోడు తండాలో జరిగింది. ఎస్సై ఎల్.నరేష్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. సీరోలు మండలం చింతపల్లి శివారు కుమ్మరిబోడు తండాకు చెందిన బానోత్‌దాసు(45) అనే వ్యక్తి 19న భార్య విజయను డబ్బులు అడిగితే ఇవ్వనందుకు మనస్థాపానికి గురై బావి వద్ద పురుగుల మందు తాగాడు. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సపొందుతూ మృతి చెందినట్లు వివరించారు. భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

హరితహారం మొక్కలు దగ్ధం

గంగారం: ప్రభుత్వ భూమిలో హరితహారంలో నాటిన మొక్కలు ప్రమాదవశాత్తు దహనమైన సంఘటన మండలంలోని కామారం గ్రామ శివారులో చోటుచేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 30 ఎకరాల్లో 20వేల వివిధ రకాల మొక్కలు హరితహారంలో నాటారు. మంగళవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని అగ్నికి ఆహుతై కాలిపోయాయి. ఫారెస్టు రేంజర్ ఆఫీసర్ చలపతి రావును వివరణ కోరగా మొక్కలు దహనమైన సంఘటన వాస్తవమేనన్నారు. ప్రమాదవశాత్తు జరిగిందా అనే కోణంలో విచారణ చేస్తున్నామని, ఏవరైనా ఉన్నట్లు తేలితే కేసులు నమోదు చేసి చర్య తీసుకుంటామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలు

గూడూరు: మండలంలోని అప్పరాజ్‌పల్లికి చెందిన మోహినోద్దిన్ అనే వ్యక్తి ఓ వ్యక్తిని ద్విచక్రవాహనంపై మానుకోటకు వెళ్తుండగా బొద్దుగొండ శివారు గండితండా జాతీయ రహదారికి చేరుకోగానే వీధి కుక్క అడ్డు వచ్చింది. దీంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి గుంతలో పడడంతో మోహినోద్దిన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. తండావాసులు గుర్తించి ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెప్పారు.

ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదు



నెహ్రూసెంటర్: ఎమ్మెల్యే సాయన్న అంత్యక్రియలను ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో జరపకపోవడం విచారకరమని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో సాయన్న సంతాప సభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లి సుధాకర్ మాట్లాడుతూ.. సినీనటులు, దర్శకులు, నిర్మాతలు చనిపోతే అధికారికంగా నిర్వహించే ప్రభుత్వం తెలంగాణ ఉద్యమంలో పని చేసిన సాయన్న చనిపోతే ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు నాయిని భరత్, కృష్ణ, కేశవులు, రాధాకృష్ణ, సురేష్, సాత్విక్, శరత్, చందు, తదితరులు పాల్గొన్నారు.